
శాసనసభలో మంత్రులు భట్టి, శ్రీధర్‌బాబుకు కాగ్ నివేదికను చూపుతున్న మాజీ మంత్రి హరీశ్

## కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం
# బట్టబయలు

**పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన అప్పు 4.17లక్షల కోట్లే**

- కాగ్ రిపోర్ట్, ఆర్థిక మంత్రి భట్టి ఇదే చెప్పారు
- ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కడిగిపారేశాం
- మేమడిగిన ప్రశ్నలకు సమాధానాలు దాటవేశారు
- డీలిమిటేషన్‌పై చర్చించకుండా తోకముడిచారు
- నీళ్ల లెక్కలు చెప్పమంటే మంత్రి నీళ్లు నమిలారు
- సభ సాక్షిగా బీజేపీ, కాంగ్రెస్ మైత్రి బంధం నిరూపితం
- రాష్ట్రానికి నిధులివ్వని కేంద్రాన్ని పల్లెత్తు మాట అనలేదు
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టింది బీఆర్ఎస్ మాత్రమే
- అసెంబ్లీ, మీడియా పాయింట్‌లో మాజీ మంత్రి హరీశ్

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): 'బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఏటా రూ.41 వేల కోట్ల చొప్పున చేసిన అప్పు అక్షరాల రూ.4.17లక్షల కోట్లే.. ఇది కాగ్ రిపోర్ట్‌తోపాటు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రసంగంలో తేట తెల్లమైంది. అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్‌ది గోబెల్స్ ప్రచారమని నిరూపితమైంది' అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ చేసిన అప్పులపై అబద్ధపు ప్రచారాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంలో, ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగట్టడంలో బీఆర్ఎస్ సఫలీకృతమైందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పత్రికల్లో హెడ్‌లైన్లు, బ్రేకింగ్‌ల కోసమే మాట్లాడి సమావేశాలను సిల్లీగా తీసుకున్నారని విమర్శించారు. 'కాంగ్రెస్ సర్కారు 15 నెలల్లో తెచ్చిన అప్పులు, ఖర్చులపై సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తలోమాట చెప్పారు. ఈ రోజు సీఎం 3:58 గంటలకు రూ.1.58 లక్షల కోట్లు అప్పులు చేసి అందులో రూ. 1.53 లక్షల కోట్లు అసలు, వడ్డీలు కట్టామని అన్నారు. కానీ, డిప్యూటీ సీఎం భట్టి రాత్రి 7:44 గంటలకు రూ.88 వేల కోట్లు అసలు, వడ్డీలకు చెల్లించామని చెప్పారు. ఇద్దరు కలిసి నాలుగు గంటల్లోనే రూ.70 వేల కోట్ల తేడా చూపారు' అని ఎద్దేవా చేశారు. గురువారం ఆయన అసెంబ్లీ మీడియాపాయింట్‌లో, అంతకు ముందు అసెంబ్లీలో మాట్లాడారు. ఈ బడ్జెట్ సమావేశాల సాక్షిగా కాంగ్రెస్ సభా సంప్రదాయాలను, విలువలను మంటగలిపిందని ధ్వజమెత్తారు. 11 రోజులు సభ నడిపి రెండురోజులే ప్రశ్నోత్తరాలు నిర్వహించడం ఇందుకు నిదర్శనమని అన్నారు. చర్చలు జరిగిన తీరు చూస్తే కేవలం బడ్జెట్ ఆమోదానికే సభను నిర్వహించినట్లు అర్థమవుతున్నదని అన్నారు. శాసనసభలో ఫిరాయింపు ఎమ్మెల్యేల గురించి సీఎం మాట్లాడిన తీరుపై సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్తామని హరీశ్ చెప్పారు.

> కాంగ్రెస్ సర్కారు 15 నెలల్లో తెచ్చిన అప్పులు, ఖర్చులపై సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తలోమాట చెప్పారు. ఈ రోజు సీఎం రేవంత్‌రెడ్డి 3:58 గంటలకు రూ.1.58 లక్షల కోట్లు అప్పులు చేసి అందులో రూ.1.53 లక్షల కోట్లు అసలు, వడ్డీలు కట్టామని అన్నారు. కానీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాత్రి 7:44 గంటలకు రూ.88 వేల కోట్లు అసలు, వడ్డీలకు చెల్లించామని చెప్పారు. నాలుగు గంటల వ్యవధిలోనే ఇద్దరు కలిసి రూ. 70 వేల కోట్ల తేడా చూపారు.
> **- హరీశ్‌రావు**

### అకారణంగా జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్..

సభ్యుల సస్పెన్షన్ విషయంలోనూ ప్రభుత్వం మాటతప్పిందని హరీశ్ విమర్శించారు. జగదీశ్‌రెడ్డిపై అకారణంగా వేటు వేసిందని అన్నారు. డీలిమిటేషన్‌పై కేటీఆర్‌కు అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వం తోకముడిచిందని దుయ్యబట్టారు. ఏ అంశాన్ని లేవనెత్తినా సరైనా సమాధానం ఇవ్వకుండా మంత్రులు దాటవేశారని చెప్పారు. నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లకు గత బడ్జెట్‌లో రూ.22,500 కోట్లు కేటాయించి ఒక్క రూపాయి ఖర్చుచేయలేదని విమర్శించారు. మైనార్టీలకు రూ.3,500 కోట్లు కేటాయించి రూ.1100 కోట్లే ఖర్చుచేసి వారిని నిలువునా ముంచిందని అన్నారు. కల్యాణలక్ష్మి తులం బంగారం, మహిళలకు స్కూటీలు, పింఛన్ల పెంపు ఇలా అనేక అంశాలపై కాంగ్రెస్‌ను బీఆర్ఎస్ కడిగిపారేసిందని చెప్పారు. రోడ్ల నిర్మాణంపై ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి చెప్పిన తప్పుడు లెక్కలను ప్రశాంత్‌రెడ్డి విజయవంతంగా బట్టబయలు చేశారని ప్రశంసించారు. తప్పుడు సమాచారం ఇచ్చిన మంత్రిపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చామని తెలిపారు. ప్రొటోకాల్ ఉల్లంఘన విషయంలోనూ స్పీకర్ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.

### బయటపడ్డ బీజేపీ-కాంగ్రెస్ మైత్రి బంధం..

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీజేపీ, కాంగ్రెస్ మైత్రి బంధం బయటపడ్డదని హరీశ్‌రావు అన్నారు. 'కాంగ్రెస్ ఏ పేపర్ ఇస్తే బీజేపీ వాళ్లు అదే మాట్లాడారు. పరస్పరం ఆలింగనం చేసుకుంటూ పొగడ్తలు కురిపించుకున్నారు' అని చెప్పారు. రాష్ట్రానికి నిధులివ్వకుండా మోసం చేసిన మోదీ సర్కారును అటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇటు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క పల్లెత్తుమాట అనలేదని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేండ్ల పాలనలో రూ.125 లక్షల కోట్లు అప్పులు చేసిన విషయాన్ని విస్మరించి ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఇక్కడ అప్పుల గురించి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. వారు చేసిన అప్పు దేశ జీడీపీలో 57 శాతమని, అదే బీఆర్ఎస్ పదేండ్లలో చేసిన అప్పు జీఎస్‌డీపీలో కేవలం 27 శాతం మాత్రమేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి చెరో ఎనిమిది మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి అన్యాయమే జరిగిందనే విషయాన్ని కేటీఆర్ సోదాహరణంగా ఎత్తిచూపారని తెలిపారు.

> **కాంగ్రెస్ రుణమాఫీ రూ. 8 వేల కోట్లే**
>
> *రుణమాఫీపై కాంగ్రెస్ ఆడిన దాగుడుమూతలు రైతులోకానికి తెలిసిపోయాయని హరీశ్‌రావు చెప్పారు. బడ్జెట్‌లో రూ.31వేల కోట్లు కేటాయించి కేవలం రూ.20 వేల కోట్లే ఖర్చు చేసి అన్నదాతను నిలువునా మోసం చేసిందని దుయ్యబట్టారు. ఇందులోనూ వానకాలంలో రూ.8 వేల కోట్లు, యాసంగిలో రూ.4 వేల కోట్లు రైతు బంధు ఎగ్గొట్టి ఈ నిధులను రుణమాఫీకి మళ్లించిందని, అంటే కేవలం రూ.8 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేసిందని వివరించారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్, లేదంటే తన నియోజకవర్గం సిరిసిల్లలో నిరూపించేందుకు సిద్ధమని కేటీఆర్ విసిరిన సవాల్‌ను స్వీకరించకుండా పారిపోయిందని అన్నారు*

### నీళ్ల లెక్కలు చెప్పమంటే నీళ్లు నమిలారు

ప్రాజెక్టుల పూర్తి, పురోగతిపై మంత్రి ఉత్తమ్‌ను లెక్క అడిగితే నీళ్లు నమిలారని హరీశ్ ఎద్దేవా చేశారు. నిరుడు ఆరు ప్రాజెక్టులు పూర్తిచేస్తామని చెప్పారని, ఒక్కటి కూడా పూర్తిచేయకుండానే మళ్లీ ఇప్పుడు 12 ప్రాజెక్టులు పూర్తిచేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. ఉత్తమ్‌తోపాటు మంత్రులందరూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారని మండిపడ్డారు.

### భట్టి, శ్రీధర్ బాబుకు హరీశ్ వివరణ

శాసనసభ లోపల ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు సీట్ల వద్దకు వెళ్లి హరీశ్ కాగ్ రిపోర్టులో అప్పుల గురించి ఏమున్నదో వివరించి చెప్పారు. మంత్రులు అప్పుల విషయంలో తప్పులు చెప్తున్నారని, వారికి ఆధారాలను ఇచ్చారు. కాగ్‌లో ఉన్న అంశాలనే వివరించి చెప్పారు.

## అప్పులపై అబద్ధాలను
# కడిగేసిన కాగ్

మొదటిపేజీ తరువాయి...

భట్టి విక్రమార్క సహా కాంగ్రెస్ నేతలంతా తప్పుడు ప్రచారం చేస్తున్నారని నివేదిక నిగ్గు తేల్చింది. రాష్ట్రం అప్పుల కుప్ప అయ్యిందంటూ ఎన్నికలకు ముందు, అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ నేతలంతా చేస్తున్నది దుష్ప్రచారమే అని కుండబద్దలు కొట్టింది. లెక్కలతో సహా చెంప ఛల్లుమనిపించేలా సమాధానమిచ్చింది. రాష్ట్రానికి వచ్చే ఆదాయమంతా అప్పులు కట్టడానికే సరిపోతున్నదంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రచారం బూటకమేనని తేల్చేసింది. తమ పాలనలో రాష్ట్ర ఆదాయం పడిపోతే.. దానిని కప్పిపుచ్చుకునేందుకే 'కడుపు కట్టుకొని పనిచేస్తున్నాం' అంటూ బీద అరుపులు అరుస్తున్నదని స్పష్టమైంది.

### పదేండ్ల అప్పు.. రూ. 4.19 లక్షల కోట్లే

కేసీఆర్ పాలనలో రాష్ట్రంపై ఏడు లక్షల కోట్ల అప్పు అని కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ చేస్తున్నదంతా దుష్ప్రచారమని కాగ్ నివేదిక తేల్చి చెప్పింది. 2024 మార్చి 31 నాటికి తెలంగాణ మొత్తం అప్పులు రూ.5,17,659 కోట్లుగా పేర్కొన్నది. ఇది రాష్ట్ర జీఎస్‌డీపీలో 34.47 శాతం. ఇందులో రూ.3,96,715 కోట్లు బడ్జెట్ రుణాలు అని, రాష్ట్ర ప్రభుత్వ హామీల కింద కార్పొరేషన్లు, స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ద్వారా రూ.1,20,944 కోట్లు సమీకరించినట్టు వెల్లడించింది. ఇందులో.. తెలంగాణ ఏర్పడే నాటికే ఉమ్మడి రాష్ట్రం నుంచి వారసత్వంగా వచ్చిన అప్పు రూ.72 వేల కోట్లు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 2024 మార్చి వరకు చేసిన అప్పులు రూ. 15 వేల కోట్లు. ఇదే సమయంలో చేసిన బడ్జెటేతర రుణాలు రూ. 11 వేల కోట్లు. అంటే మొత్తం రూ. 98 వేల కోట్లు. మొత్తం అప్పుల నుంచి వీటిని మినహాయిస్తే.. కేసీఆర్ పదేండ్ల పాలనలో చేసిన అప్పు రూ.4,19,659 కోట్లే అని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కరోనా విపత్తు సమయంలో రాష్ట్రాలు భారీగా ఆదాయం కోల్పోయిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2020-22 మధ్య ప్రత్యేక రుణాలు మంజూరు చేసింది. ఇందులో తెలంగాణకు రూ.6,949 కోట్లు కేటాయించింది. వీటిని ఈ అప్పుల నుంచి మినహాయిస్తున్నట్టు కాగ్ వెల్లడించింది. ఒకవేళ వీటిని కూడా కలుపుకున్నా కేసీఆర్ పాలనలో చేసిన అప్పు రూ.4,26,608 లక్షల కోట్లే అని స్పష్టమవుతున్నది.. దీనినిబట్టి రాష్ట్రంపై ఏడు లక్షల కోట్ల అప్పు మోపారని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు చేస్తున్నదంతా పచ్చి అబద్ధమని తేలిపోయిందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. బహిరంగ సభల్లో, అసెంబ్లీలో, సన్మాన, సత్కార సభలు.. ఇలా సందర్భం వచ్చిన ప్రతి చోట కాంగ్రెస్ నేతలు చేసిన దుష్ప్రచారానికి ఇప్పుడేం సమాధానం చెప్తారని ప్రశ్నిస్తున్నారు.

### కిస్తీలు, మిత్తీలపైనా తప్పుడు ప్రచారమే

'గత ప్రభుత్వం మాపై అప్పుల కుప్ప మోపింది. ప్రతి నెల ఒకటో తారీకు నాడు రూ.6500 కోట్లు అసలు, మిత్తి రూ.6500 కోట్లు కట్టాల్సి వస్తున్నది. రాష్ట్రానికి వచ్చే ఆదాయం అంతా అప్పులు కట్టడానికే సరిపోతున్నది' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి తరచూ చెప్తుంటారు. అయితే ఇదంతా అసత్య ప్రచారమని కాగ్ స్పష్టం చేసింది. కాగ్ నివేదిక ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం కిస్తీలు, మిత్తీలకు చెల్లించిన మొత్తం రూ.53,978 కోట్లు. ఇందులో బడ్జెట్ రుణాల చెల్లింపు రూ.32,939 కోట్లు కాగా, బడ్జెటేతర రుణాలు రూ.21,039 కోట్లు చెల్లించినట్టు వెల్లడించింది. చెల్లించిన మొత్తంలో అసలు రూ.21,058 కోట్లు కాగా వడ్డీ రూ.32,920 కోట్లు. ఈ లెక్కన రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల అసలు, వడ్డీ కలిపి 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రతినెల రూ.4,498 కోట్లు మాత్రమే చెల్లించింది. 2024-25 సంవత్సరంలోనూ బడ్జెట్ రుణాల చెల్లింపు రూ.33 వేలకోట్లే అని నివేదిక స్పష్టం చేసింది. ఈ లెక్కన బడ్జెట్, బడ్జెటేతర రుణాలు కలిపినా.. ప్రభుత్వం నెలకు రూ. 5000 కోట్ల వరకు చెల్లించే అవకాశం ఉన్నట్టు ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అంటే కాంగ్రెస్ నేతలు ఒక రూపాయి కట్టి మూడు రూపాయలు కట్టినట్టుగా ప్రజలను మభ్య పెట్టారని మండిపడుతున్నారు.




**కాగ్ నివేదిక ప్రకారం...**

2024 మార్చి 31 నాటికి తెలంగాణ మొత్తం అప్పు **రూ. 5,17,659 కోట్లు**

బడ్జెట్ రుణాలు **రూ.3,96,715 కోట్లు**

బడ్జెటేతర రుణాలు **రూ.1,20,944 కోట్లు**

తెలంగాణకు ఉమ్మడి రాష్ట్రం నుంచి వారసత్వంగా వచ్చిన అప్పు **రూ. 72 వేల కోట్లు**

2023 డిసెంబర్ - 2024 మార్చి మధ్య కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు **రూ. 26 వేల కోట్లు**

**మొత్తం రూ. 98 వేల కోట్లు**

అంటే కేసీఆర్ పాలన కాలంలో చేసిన అప్పు రూ. 4,19,659 కోట్లు

కాగ్ చెప్పిన లెక్క ఇది

బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంపై మోపిన అప్పు రూ.7 లక్షల కోట్లు
- కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం ఇది

**అంటే.. వాస్తవ అప్పును రెట్టింపు చేసి దుష్ప్రచారం**

అసలు, వడ్డీ కలిపి ప్రభుత్వం ప్రతి నెలా చెల్లిస్తున్నది రూ. 4500 కోట్లు
- కాగ్ వెల్లడించిన సత్యం ఇది

ప్రభుత్వం ప్రతినెల ఒకటో తేదీన అసలు రూ. 6500 కోట్లు వడ్డీ రూ. 6500 కోట్లు చెల్లిస్తున్నది.
- కాంగ్రెస్ చేస్తున్న అసత్య ప్రచారం

**అంటే చెల్లిస్తున్న దానికన్నా మూడింతలు పెంచి అభాండాలు మోపుతున్నది**

| సంవత్సరం | సొంత పన్నులు (రూ. కోట్లలో) | వృద్ధి (రూ.కోట్లలో) | శాతం |
|---|---|---|---|
| 2020-21 | 66,650 | - | - |
| 2021-22 | 91,271 | 24,621 | 37% |
| 2022-23 | 10,6949 | 15,678 | 18% |
| 2023-24 | 11,1798 | 4,849 | 4.53% |



### అప్పులు వారసత్వం.. కట్టడం బాధ్యత

వాస్తవానికి ప్రభుత్వాలకు అప్పులు వారసత్వంగా వస్తాయని.. ఒక ప్రభుత్వం చేసే అప్పులు మరొక ప్రభుత్వం చెల్లిస్తుందని నిపుణులు చెప్తున్నారు. ప్రభుత్వాలు పాత అప్పులు చెల్లిస్తూనే కొత్త అప్పులు చేస్తుంటాయని, ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర పాలనలో చేసిన రూ.1.58 లక్షల కోట్ల అప్పులే ఉదాహరణ అని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడే నాటికి ఉమ్మడి రాష్ట్రం నుంచి వారసత్వంగా 72 వేల కోట్ల రుణ భారం ఉన్నదని గుర్తు చేస్తున్నారు. నాటి బడ్జెట్ లక్ష కోట్లు అని, అంటే బడ్జెట్‌తో పోలిస్తే 72 శాతం అప్పుల భారం ఉన్నట్టు పేర్కొన్నారు. వాటిని కేసీఆర్ ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు. ఇక కాగ్ గణాంకాల ప్రకారమే.. 2014-15 నుండి 2023-24 నాటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.34 లక్షల కోట్ల అప్పులు చెల్లించిందని తెలిపారు. కానీ వీటిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా చెప్పకుండా.. కేవలం అప్పుల కుప్ప మోపిందంటూ ప్రచారం చేస్తున్నదని మండిపడుతున్నారు.

### అప్పులన్నీ అభివృద్ధి కోసమే..


కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న అప్పులను రాష్ట్ర అభివృద్ధి కోసమే వెచ్చించినట్టు కాగ్ నివేదిక స్పష్టం చేసింది. తెచ్చిన అప్పులను మూలధన వ్యయంగా ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల కల్పనపై పెట్టుబడిగా పెట్టిందని వెల్లడించింది. 2019-20, 2023-24 మధ్య తీసుకున్న నిధులలో 80 శాతానికి పైగా మూలధన వ్యయంగా పెట్టినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2023-24లో మొత్తం రూ. 50,528 కోట్ల రుణం తీసుకోగా అందులో 87 శాతం.. అంటే రూ.43,918 కోట్లు మూలధన వ్యయం కోసం ఉపయోగించినట్టు నివేదిక వివరించింది.

### రాష్ట్రానికి పెరిగిన ఆదాయం..

కేసీఆర్ ప్రభుత్వం మూలధన వ్యయంతో భారీగా పెట్టుబడులు పెట్టడం వల్ల సొంతరాబడులు గణనీయంగా పెరిగినట్టు కాగ్ నివేదిక స్పష్టం చేస్తున్నది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.67,597 కోట్లుగా ఉన్న రాష్ట్ర సొంత పన్ను ఆదాయం 2022-23 నాటికి రూ.1,06,949 కోట్లకు పెరిగింది. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తున్నదని నిపుణులు మండిపడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో వేగంగా పెరిగిన సొంత పనుల ఆదాయ వృద్ధి.. కాంగ్రెస్ వచ్చాక తర్వాత తగ్గింది. కేసీఆర్ పాలనలో రెవెన్యూ వసూళ్లు స్థిరమైన వృద్ధిని నమోదు చేశాయని, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా రూ.15,988 కోట్ల నుంచి రూ.23,742 కోట్లకు పెరిగిందని వెల్లడించింది.

> **అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే..**
>
> *కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న అసమర్థ, అసంబద్ధ నిర్ణయాల ఫలితంగా మొదటిరోజు నుంచే రాష్ట్ర ఆదాయంపై దెబ్బ పడింది. అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది, మూసీ పునర్జీవ ప్రాజెక్టును తెరమీదికి తెచ్చింది. దీంతో రియల్ ఎస్టేట్ రంగం ఒక్కసారిగా ఒడిదుడుకులకు లోనైందని నిపుణులు చెప్తున్నారు. ఈ ప్రభావం మిగతా రంగాలపై పడటంతో.. రాష్ట్ర ఆదాయం తగ్గినట్టు పేర్కొంటున్నారు. ఫలితంగా 2023- 24లో రెవెన్యూ వసూళ్లు రూ.1.69 లక్షల కోట్లకే పరిమితమైనట్టు పేర్కొంటున్నారు. వాస్తవానికి అదనంగా కనీసం రూ.20-30 వేల కోట్లు రావాల్సి ఉండేదని చెప్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఈ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కేసీఆర్ పాలనపై పదేపదే అసత్య ప్రచారం చేస్తున్నదని మండిపడుతున్నారు. అసెంబ్లీ సాక్షిగా కాగ్ నివేదిక అసలు లెక్కలను బయటపెట్టిన నేపథ్యంలో.. ఇప్పటికైనా ప్రభుత్వం తప్పుడు ప్రచారం మానుకోవాలని సూచిస్తున్నారు. తప్పులను ఒప్పుకొని ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని కోరుతున్నారు.*

**లోకం పోకడ**




## జీరో అవర్‌లో బీఆర్ఎస్‌పై చిన్నచూపు

- 1.45 గంటలపాటు కొనసాగిన జీరో అవర్
- అధికార పార్టీ సభ్యులకు ఎక్కువ సమయం
- ప్రతిపక్ష బీఆర్ఎస్ ఒక్క ప్రశ్నకే పరిమితం
- మల్లారెడ్డి బతిమాలినా పట్టింపులేని వైనం

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో చివరి రోజైన గురువారం జీవోఅవర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై చిన్నచూపు చూశారు. 1.45 గంటల సమయంలో మొత్తం 52 మంది సభ్యులు తమ నియోజకవర్గ సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అధికార పార్టీ సభ్యులు ఎక్కువ సమయం తీసుకున్నారు. బీఆర్ఎస్ సభ్యులు మల్లారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డికి ఒక్క నిమిషంలోపే మైక్ కట్ అయింది.

**మా జిల్లాకు దిష్టి తగిలింది: మల్లారెడ్డి**



మేడ్చల్ నియోజకవర్గానికి దిష్టి తగిలిందా? అంటూ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. '61 గ్రామాలు పోయి అన్ని మున్సిపాలిటీలు అయినయ్. కొత్తగా 3 మున్సిపాలిటీలు చేసింద్రు. గతంల పదేండ్ల కోసం రిజర్వేషన్లు తెచ్చింద్రు. ఇప్పుడు ఐదేండ్లకే సమాప్తిజేసింద్రు. మా 13 మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో కలపొద్దు' అని కోరారు. మాట్లాడుతుండగానే మైక్ కట్ అయింది.



## కాంగ్రెస్, బీజేపీ దోస్తీ!

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద, సంజయ్

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్.. బీజేపీలు ఢిల్లీలో కుస్తీ చేస్తూ, గల్లీలో దోస్తీ చేస్తున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ బాహాటంగానే ఒప్పందం చేసుకొని అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై దాడి చేస్తున్నాయని తెలిపారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కోరుట్ల ఎమ్మెల్యే కే సంజయ్‌తో కలిసి మాట్లాడారు. రెండు పార్టీల మైత్రి అసెంబ్లీలో బట్టబయలైందని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చిందని చెప్పారు. అసెంబ్లీలో కాళేశ్వరంపై మాట్లాడిన బీజేపీ ఎమ్మెల్యే ఢిల్లీలో కేంద్రం ఇచ్చిన అనుమతులను తప్పుబడుతున్నారా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డితో బీజేపీ ఎమ్మెల్యేలు డీలింగ్ పెట్టుకొనే బీఆర్ఎస్‌ను విమర్శిస్తున్నారని ఎమ్మెల్యే కే సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ హటావో దేశ్ కో బచావో అని ప్రధాని మోదీ అక్కడ అంటారని, ఇక్కడ కాంగ్రెస్‌ను కాపాడండి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించండి.. అన్న చందంగా బీజేపీ వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు.

## తీన్మార్ మల్లన్నకు గుత్తా స్ట్రాంగ్ వార్నింగ్

- మండలిలోని సభ్యుల మీద ఆరోపణలపై ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం శాసనమండలిలో విద్యపై చర్చ సందర్భంగా తీర్మార్ మల్లన్న మాట్లాడుతూ.. ఏవీఎన్‌రెడ్డి విద్యాసంస్థలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను విద్యాశాఖ నిబంధనల ప్రకారమే ఫీజులు నిర్ణయించానని తనపై ఆరోపణలు చేయడం తగదని మండలి దృష్టికి తెచ్చారు. ఇంతలో తీన్మార్ మల్లన్న జోక్యం చేసుకోగా సస్పెండ్ చేయాల్సి వస్తుందని చైర్మన్ అగ్రహం వ్యక్తం చేశారు.

### హోంగార్డుకు సన్మానం



అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యేల వాహనాల పార్కింగ్ అనౌన్స్ చేసే హోంగార్డు దావూద్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునితా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి, కేపీ వివేకానందలు శాలువాతో సన్మానించి.. బుద్ధుడి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా తమ వాహనాల నంబర్లను మంచిగా గుర్తుంచుకోవాలని సబితా ఇంద్రారెడ్డి అనడంతో అంతా ఒక్కసారిగా నవ్వుకున్నారు.

**- హైదరాబాద్**

## సుప్రీంకోర్టునే అవహేళన చేస్తరా?


- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దుకావంటూ సభలో ఒక ముఖ్యమంత్రి ప్రకటించడం ఏమిటని బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టును అవహేళన చేస్తూ సీఎం మాట్లాడటం సరికాదని హితవు పలికారు. రాష్ట్రంలో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయని తేల్చిచెప్పారు. శాంతిభద్రతలపై తాను ప్రశ్నలు అడిగితే నేటికీ సమాధానం ఇవ్వలేదని, ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తన ఇంటిపై దాడిచేసిన ఎమ్మెల్యే గాంధీతో పాటు ఆయన అనుచరులపై చర్యలు తీసుకోనేలేదని మండిపడ్డారు.

## టెండర్ల నుంచి సింగరేణిని మినహాయించండి

- బీఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి



హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థను బొగ్గు టెండర్ల నుంచి మినహాయించాలని శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి డిమాండ్ చేశారు. గురువారం శాసనమండలిలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన మైన్స్ మినరల్స్ డెవలప్‌మెంట్, రెగ్యులేషన్ యాక్టు-215 టెండర్ల నుంచి సింగరేణిని మినహాయించాలని కోరారు. ఈ టెండర్ విధానం వల్ల సింగరేణి సంస్థ మనుగడకు ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. గుజరాత్‌లోని మైనింగ్ కంపెనీని టెండర్ల నుంచి మినహాయించారని, సింగరేణి సంస్థకు ఈ అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో కేంద్రప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సూచించారు.

### ఇంజినీరింగ్‌పై కేసీఆర్‌కు అవగాహన: చల్లా

ఇంజినీరింగ్ విధానంపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఉన్న అవగాహన తాను ఇంత వరకు ఎవరి వద్దా చూడలేదని ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి కొనియాడారు. రాజోలిబండ ప్రాంతాల్లో గతంలో 87,000 ఎకరాలకు నీళ్లు వస్తుండగా, ఇప్పుడు కేవలం 57,000 ఎకరాలకు మాత్రమే నీళ్లు వస్తున్నాయని తెలిపారు. అందుకోసం చిన్నంపల్లి రిజర్వాయర్‌కు 6 కిలోమీటర్ల లింకు పూర్తయితే రెండు టీఎంసీల నీళ్లొస్తాయని తెలిపారు. అందుకోసం కేవలం రూ.40 కోట్లు ఖర్చవుతాయని ఆయన ప్రభుత్వానికి సూచించారు.



### ఎల్ఆర్ఎస్‌లో ఇబ్బందులు తీర్చాలి: తక్కెళ్లపల్లి



ఎల్ఆర్ఎస్‌లో అనేక ఇబ్బందులు ఉన్నాయని, వాటిని పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీంద్రరావు కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకున్నప్పుడే ఫీజు ఎంత చెల్లించాల్సి ఉంటుందో తెలిపే వారని, కానీ ఇప్పుడు ఎంత ఫీజు చెల్లించాల్సి ఉంటుందో నోటీసులు వచ్చేంతవరకు తెలియడం లేదని గుర్తుచేశారు.

### పోలీసుల బకాయిలివ్వండి: సుభాశ్‌రెడ్డి



రాష్ట్రంలోని పోలీసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి రెండేండ్లుగా నిలిచిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదలయ్యేలా ప్రభుత్వం చ ర్యలు తీసుకోవాలని ఎమ్మె ల్సీ శేరి సుభాష్‌రెడ్డి కోరారు. వారికి ఏకీకృత సర్వీసులను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

### అమరుడు యాదయ్య విగ్రహం ఏర్పాటుచేయాలి: ఎల్ రమణ



తెలంగాణ ఉద్యమంలో ఆత్మ బలిదానం చేసుకున్న అమరవీరుడు సిరిపురం యాదయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ ఎల్ రమణ ప్రభుత్వాన్ని కోరారు. యాదయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని, దానిని వెంటనే పూర్తిచేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## అప్పులను చూపి పథకాలు ఎత్తేయొద్దు

- ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్



హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుల పేరు చెప్పి, ఎన్నికల హామీలను విస్మరించవద్దని బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ద్రవ్యవినిమయ బిల్లుపై కొనసాగిన చర్చలో ఆయన మాట్లాడుతూ సర్కారు అభయహస్తం పథకాలను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాలా తీసిందని, అప్పులను తీర్చేందుకే అప్పులు తెస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అప్పులను చూపి పథకాలను ఎత్తగొట్టవద్దని హెచ్చరించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నట్టుగానే చిన్న కాంట్రాక్టర్ల బిల్లులను కూడా చెల్లించాలని, బిల్లులపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగవర్గాల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.